క్లుప్తంగా

డీఎస్సీ ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోండి

కార్వేటినగరం: డీఎస్సీ ఉచిత శిక్షణను ఎస్సీ, ఎస్టీ అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమాధికారి డీ. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంఘిక సంక్షేమ శాఖ అమరావతి ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీపై శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణ పొందడానికి అభ్యర్థులు టెట్ అర్హత కలిగి వార్షికాదాయం రూ. 2.50 లక్షల లోపు కలిగి ఉండాలని, అభ్యర్థులు 25 తేదీ సాయంత్రం లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి జీ.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


క్రిష్ణమోహన్ రెడ్డి

పాలసముద్రం : ఎంపీడీఓగా క్రిష్ణమోహన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండలం అభివృద్ధికి, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

ఆలయ నిర్మాణానికి రూ.15వేల విరాళం


విరాళం అందిస్తున్న దాతలు

నగరి : పట్టణ పరిధిలోని బస్టాండు సమీపంలో నిర్మిస్తున్న మునేశ్వర స్వామి ఆలయానికి దాతలు రూ.15వేలు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ ప్రాంతానికి సోమవారం విచ్చేసిన వారు తమ విరాళాన్ని ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఆలయ నిర్మాణం వేగంగా నిర్వహిస్తుండడం మొక్కులు చెల్లించుకోవడానికి విచ్చేసే భక్తులకు అవసరమైన మౌళిక సదుపాయాలు కలిపిస్తుండడంతో తమ వంతు సహకారం అందించాలని విరాళం అందజేస్తున్నామన్నారు.

పెసర్లు, మినుములు రాయితీపై పంపిణీకి సిద్ధం

విజయపురం : మండలంలో మినుములు (ఉద్దులు) -12 క్వింటాళ్లు, పెసర్లు 2 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఏవో రజినికుమారి తెలిపారు. మినుములపై 30శాతం రాయితీ ఉంటుందని, రైతులు పట్టదారు పాసుపుస్తకం తీసుకొచ్చి కొనుగోలు చేయవచ్చునని ఆమె అన్నారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కార్వేటినగరం: స్థానిక రాజా కుమారరాజా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రం బోధించడానికి కాంట్రాక్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ స్వరూప కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 28న ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలన్నారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు ఎమ్మెస్సీ భౌతికశాస్త్రంలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు.

సకాలంలో వినతుల పరిష్కారం

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) ద్వారా అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా అందే వినతులు, ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని ససూచించారు. పూర్తిస్థాయి విచారణ నివేదికలను సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో మొత్తం ఇంజినీరింగ్ -4, టీపీవో -1, రెవెన్యూ -1, అకౌంట్స్ -1 చొప్పున మొత్తం 7 వినతులు అందాయి. కార్యక్రమంలో విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

బంగారుపాళెం: వాహనదారులు రహదారి నింబంధనలు పాటించాలని బంగారుపాళెం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద సోమవారం సాయంత్రం వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ విధిగా ధరించాలని సూచించారు. నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాల తీవ్రత తక్కువగా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ద్విచక్ర వాహనదారులే ప్రమాదాల బారిన పడుతుంటారన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రహదారి నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు తప్పవని హెచ్చరించారు.

తమ్ముళ్ల ఇసుక దందా!

అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు ఇసుక దందా మొదలెట్టేశారు. నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. పేరుకు ఉచితమన్నారే గానీ, అసలు ఇసుక కంటికి కనిపించడంలేదు. దొడ్డిదారిలో పట్టపగలే ఇసుకను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. సొంత స్థలాల్లో నిల్వ చేసుకుంటున్నారు. వినియోగదారులకు ట్రాక్టర్‌కు రూ.5 వేలు చొప్పున అమ్ముకుంటున్నారు. ఇలా ఇష్టారాజ్యంగా నదులు, వాగులు, వంకల్లో ఇసుకను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో చెలరేగిపోతున్నారు. జేబులు నింపుకోవడమే లక్ష్యంగా ఇసుక దందా సాగిస్తున్నారు.

- దొంగదారిలో అక్రమంగా రవాణా
- ట్రాక్టర్ ఇసుక రూ.5వేలకు విక్రయం
- జాడ లేని ఉచిత ఇసుక
- పట్టించుకోని అధికారులు


కేవీ శ్రీరామపురం నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

విజయపురం : మండలంలో టీడీపీ నేతల కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మండలంలో కేవీశ్రీ రామపురం కుశస్థలినది నుంచి రాత్రీ, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. ఇక ట్రాక్టర్ ఇసుక రూ.3వేలు నుంచి 5వేలకు అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు. కుశస్థలినదిలో ఇసుక తరలించకూడదంటూ అధికారులు చుట్టూ కంచె వేశారు. అయితే వ్యవసాయ పొలంపై దొంగ దారి ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలించి, సొంత పొలాల్లో డంప్ చేసుకుని అమ్ముకుంటున్నారు.

ఇసుకకు డిమాండ్

మండలంలో మొత్తం 25 పంచాయతీ, 115 గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ ఇల్లు నిర్మాణం చేపట్టాలంటే ఇసుక దొరకడం కష్టంగా మారింది. ఇల్లత్తూరు, కేవీరామపురం మీదుగా వెళ్లే కుశస్థలి నదిలో మాత్రమే కాస్త ఇసుక దొరుకుతోంది. అయితే ఇల్లత్తూరు కుశస్థలినదిలో రాజీవ్ టెక్నాలజీ ద్వారా తాగునీరు అందించే బోర్లు ఉండడంతో అక్కడి నుంచి ఇసుకను తరలించడానికి అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో కేవీ శ్రీరామపురం కుశస్థలినది నుంచి ఇసుకను సరఫరా చేయాలి. అయితే ప్రస్తుతం అక్కడ రీచ్ లేకపోవడంతో ఇసుక డిమాండ్ ఎక్కువైంది.

ట్రాక్టర్ ఇసుక రూ. 5వేలు

ఇసుకకు మంచి డిమాండ్ ఉండడంతో అధికార పార్టీ శ్రేణులు ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. దీంతో రాత్రి, పగలు తేడా లేకుండా వ్యవసాయ పొలంపై దారి ఏర్పాటు చేసుకొని ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. గంగమాంబపురం, కేవీపురం, కాళికాపురం, దామరపాకం,


ఇసుక తరలించేందుకు పొలం మధ్యలో నుంచి ఏర్పాటు చేసిన దారి

కేవీకండ్రిగలో రూ.3వేలుకు విజయపురం, జగన్నాథపురం, పన్నూరు, కోసలనగరం, తదితర గ్రామాల్లో రూ.5వేలుకు ఇసుక విక్రయిస్తున్నట్లు సమాచారం. పగటి పూట బహిరంగంగా ఇసుక తరలిస్తూ, అధిక ధరలకు అమ్మతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు 1.50 సెంటు ఇంటి స్థలంలో పాటు ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. మండలానికి 748 ఇళ్లు కేటాయించగా అందులో 468 నివాసాల నిర్మాణం పూర్తయింది. వీటిలో 280 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇసుక లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ప్రచారం చేస్తున్నా ఇక్కడ అది అమలు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక రూ.3వేలు నుంచి 5వేలు ఇచ్చి కొనుగోలు చేసుకొంటున్నామని స్థానికులు చెబుతున్నారు. దీన్ని ఎవరైనా ప్రశ్నిస్తే ఇసుక లేదు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని ట్రాక్టర్ యజమానులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక లేక ఇల్లు కట్టలేదు



నాకు జగనన్న పథకం ద్వారా ఇల్లు మంజూరైంది. సుమారు 7 అడుగులు గోడ వరకు కట్టుకున్నాను. ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పుడు అధికారులు ఇంటి వద్దకు వచ్చి తొందరగా ఇల్లు కట్టండి.. కట్టండి అని చెబుతున్నారు. ఇసుక లేకుండా ఇల్లు ఎలా కట్టాలని ప్రశ్నించాను. దీంతో వారు వెనుదిరిగారు. ట్రాక్టర్ ఇసుక అడిగితే రూ. 5వేలు అని చెప్పారు. అంత డబ్బు లేకపోవడంతో ఇల్లు కట్టడం ఆపివేశాను.

– జయరాం, విజయపురం


పట్టపగలే ట్రాక్టర్‌లో తరలిపోతున్న ఇసుక

సుదర్శన హోమంలో మాజీ మంత్రి రోజా


మాజీ మంత్రికి వెంకటేశ్వర స్వామి ప్రతిమ అందిస్తున్న నిర్వాహకులు

నగరి : మున్సిపల్ పరిధి సత్రవాడలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బాలకృష్ణ స్వగృహంలో సోమవారం ప్రత్యేకంగా నిర్వహించిన సుదర్శన హోమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ సుదర్శన హోమ కార్యక్రమంలో వేదపండితులు వేద మంత్రాలతో మాజీ మంత్రిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, పార్టీ పట్టణ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, నాయకులు బీడీ భాస్కర్, కన్నాయిరం, మురుగ, ఆనంద్‌కుమార్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ

సాక్షి ఎఫెక్ట్..

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెట్టాలని, దీనిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. సాక్షి దినపత్రికలో ఆముదాల హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజనంలో నాణ్యత కొరవడంపై కథనం ప్రచురించింది. దీనిపై ఎంఈఓ స్పందించారు. సోమవారం ఆముదాల హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనం రుచి చూసి ఆయన పైవిధంగా ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు నిరుపేద కుటుంబానికి చెందినవారే ఎక్కువని, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి పెట్టాలని, లేనిపోంలో భోజన నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి గ్రామసభలు

గుడిపాల: మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. గతంలో జరిగిన రీ సర్వేలో తప్పులుంటే సరిదిద్దుకోవడానికి ఈ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా 22వ తేదీన ముటుకూరుపల్లె, 23న పాపసముద్రం, 24న డీబీపల్లె, 25న వసంతాపురం, 26న క్రిష్ణజమ్మాపురం, 29న బందార్లపల్లె, 30న పశుమంద, నవంబర్ 5వ తేదీన చిత్తపార, 6న కుప్పిగానిపల్లె, 7న నంగమంగళం, 8న మరకాల కుప్పం, 12న మొగరాళ్లపల్లె, 13న లక్ష్మాంబపురంలో గ్రామసభలు ఉంటాయని చెప్పారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుత్తూరు: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాస్ సంస్థ పలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని శంకర్ నేత్రాలయ అధికారి వెంకటముని తెలిపారు. రాష్ట్రీయ సేవా సమితి (రాస్), చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ హాస్పిటల్ వారు సంయుక్తంగా సముదాయం గ్రామంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వెంకటముని మాట్లాడుతూ మహిళా పొదుపు సంఘ సభ్యుల సౌకర్యార్థం రాస్ సంస్థ పలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం హర్షణీయమన్నారు. ఉచిత వృత్తి శిక్షణ తరగతులు నిర్వహిస్తూ, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతగానో దోహదపడుతోందని తెలిపారు. వైద్య శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి అక్టోబర్ 23న చెన్నైలోని శంకర్ నేత్రాలయ హాస్పిటల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ నేత్రాలయ వైద్యులు వేణు, వెంకటముని, రాస్ అధికారి రవి, గ్రామ సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, గ్రామ పెద్దలు వేలురెడ్డి, మమత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్కర కుంభాభిషేకం



ఉత్సవాల్లో ఆలయ కమిటీ సభ్యులు, స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం

పుత్తూరు: శిరుగురాజుపాళెం పంచాయతీ పరిధిలోని డాక్టర్ శ్రీనివాసులురెడ్డి నగర్‌లో వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయ పుష్కర మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. చివరి రోజైన సోమవారం ఉదయం 5.30 గంటలకు విఘ్నేశ్వరపూజ, యజమాన సంకల్పం, పుణ్యాహవాచనం, చతుర్థకాల అవబృధహోనుం యాగశాల పూజాహోమం కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 7 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహించారు. 8 గంటలకు స్వామివారి గోపుర విమాన కుంభాభిషేకం, పరివార దేవతలు, శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. 9 గంటలకు స్వామివారికి పంచామృత సుగంధ ద్రవ్యాలతో మహాఅభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. రాత్రి 7 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా నడుమ ఊరేగించారు. భక్తులు అడుగడుగునా స్వామి వారికి నారికేళ కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ ఆడిటర్ ఎ.రామకృష్ణ, సభ్యులు డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రాజు, బత్తల సుబ్రమణ్యం, సాయిలు పర్యవేక్షించారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన కుంభాభిషేక కార్యక్రమాలతో శిరుగురాజుపాళెం, గొల్లపల్లి, తడుకు గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది.

ఎయిడ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి

చిత్తూరు కలెక్టరేట్: ఎయిడ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి అవసరమని కోర్ ఎన్జీఓ ఔట్ రీచ్ వర్కర్ లక్ష్మి అన్నారు. సంతపేటలోని శ్రీసాయి ఐటీఐలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్, టీబీ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. ఎయిడ్స్‌కు మందులేదని, నివారణ ఒక్కటే మార్గమని చెప్పారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం ప్రాజెక్ట్ మేనేజర్ సద్దాం, ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

మొగిలీశ్వరాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం రాహుకాల సమయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకుని మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వారిచే భక్తులకు అన్నదానం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


సచివాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

పాలసముద్రం: మొక్కలు నాటి అందరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సర్పంచ్ నరసింహరాజు కోరారు. సోమవారం వనదుర్గాపురంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద ఇప్పటి వరకు రూ.26 లక్షలతో పనులు చేసేందుకు జిల్లా కలెక్టర్ పరిపాలన ఆమోదం తెలిపారని, రైతులకు ఉపయోగపడేలా గ్రామ సభల్లో చేసిన తీర్మానాల ఆధారంగా పనులు చేయాలన్నారు. అనంతరం కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మునితర్నం, ఏఎస్ఎం కమల, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వరదరాజు, గురుప్రసాద్, శేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నగరి : స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎస్.సంజయ్ రాష్ట్రస్థాయి అండర్ 17 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. చౌడేపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచిన సంజయ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 27 నుంచి 29 వరకు కడప జిల్లా, రాయచోటిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ప్రతిభ చూపిన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవి, ఇన్‌చార్జి రవి, పీడీ వి.సురేష్‌బాబు పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో అభినందించారు.

అమరవీరుల త్యాగాలు అమూల్యం


మానవహారం ఏర్పాటుచేసిన పోలీసులు

నగరి : విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని సీఐ మహేశ్వర్ అన్నారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పోలీసులతో కలిసి అమరవీరులకు జోహార్లు అర్పించారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. పోలీసు అమరవీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి ధర్మమన్నారు. అమరవీరుల జీవితాలు ప్రతి పోలీసు అనుసరించాల్సిన మార్గాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సూర్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న పోలీసులు